

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - 25 -

"**చాలా ముఖ్యమైన పోస్ట్,** మూడు నెలలుగా ఖాళీగా ఉంది. మీరెవరినైనా పంపిస్తారో, లేదో చెప్పండి" ఫోన్ లో కోపంగానే అడిగింది ఇందిర.

"పంపిస్తున్నాను మేడం. వచ్చే వారమే డ్యూటీలో జాయిన్ అవుతాడు. కానీ ఒక్క మాట, మీరితన్ని కొంచం మంచిగా చూసుకోవాలి"

"నేను చూసుకోవడమేమిటి ? పనిమంతుడేనా? కాకపోతే నా వల్ల కాదు"

రికమండేషన్ తో వచ్చేవారంటే ఆమెకు సదభిప్రాయం లేదు.

"అదేం లేదండీ. చాలా సిన్సియర్."

"మీ బంధువా?"

" కాదండీ. అతన్ని వదులుకోగూడదని చెప్పాను. మీరైతే జాగ్రత్తగా చూసుకుంటారనీ."

***

'సారథి'

'ఎవరీ సారథి, జాగ్రత్తగా చూసుకోవడమేమిటి?' అని అతని ప్రొఫైల్ చూసింది.

ఎకడమిక్స్ , విజయాలు, అతని రికార్డ్స్ చాలా బాగున్నాయి. గత ఏడాది ఒక్క సెలవు కూడా తీసుకోలేదు.

కానీ సంవత్సరమైనా పూర్తికాకుండానే ట్రాన్స్ఫర్ కోసం అప్లై చేశాడు.

కారణం చూస్తే వ్యక్తిగతం అని రాసి ఉంది.

'నిలకడ లేని మనిషా?' అనుకోబోయి ఆగింది. సరే, అదేదో అతను పనిలో చేరాక చూద్దామనుకుంది.

***

సారథి ఆఫీసులో చేరి ఏడెనిమిదినెలలవుతోంది.

అతన్ని చేరినప్పటి నుండీ, గమనిస్తూ ఉంది. కొంత మందికి ఎదుటివారికేం కావాలో, వారేం ఆశిస్తున్నారో పసిగట్టే తెలివి ఉంటుంది. సారథికి ఆ లక్షణం ఉంది.

తనకన్నా ముందు ఆఫీసుకు వస్తాడు. తక్కువ మాటలతో ఎక్కువ పనిచెయ్యగలడు. ఏ పని చెప్పినా 'కుదరదు, కష్టం' అనే మాటలు ఎన్నడూ వినలేదు.

అన్నిటికన్నా మించి అతి వినయం లేదు.

ఇంత సిన్సియర్ ఉద్యోగిని మెయిన్ బ్రాంచ్ వాళ్ళు మామూలుగా వదులుకోరు. అతను ట్రాన్స్ ఫర్ అడిగినంత మాత్రాన, ఎలా పంపించారు?

అర్హతలన్నీ ఉన్నా, పెద్ద సిటీని, మంచి పొజిషన్ ని వదులుకుని తనకింద ఎందుకు పనిచేస్తున్నాడు. ఎందుకిక్కడికి వచ్చాడు? అతను ఆఫీసు విషయాలు తప్ప వేరే విషయాలు మాట్లాడడు.

అతన్ని కారణాలడగడమెలాగో ఆమెకు అర్థం కాలేదు.

ప్రతి సంవత్సరం చివరి రోజున ఆఫీసులో అందరికీ పార్టీ ఇస్తుంది ఇందిర. ఈ సారి ఇంట్లో పార్టీ ఇవాలనుకుంది. అందర్నీ పేరు పేరునా ఆహ్వానించింది. సారథితో కూడా కొంత చనువు పెరిగింది. అతన్ని తన కేబిన్ లోకి పిలిచి ఫామిలీతో సహా రావాలని గట్టిగా చెప్పింది.

నవ్వుతూ తలూపాడు.

అతని నవ్వు చూసిన తర్వాత ధైర్యం తెచ్చుకుని,

“సారథి, నాకో చిన్న అనుమానం. పెద్ద సిటీలో మంచి పొజిషన్ వదులుకున్నావు. చిన్న బ్రాంచ్ కు ఎందుకు ట్రాన్స్ఫర్ పెట్టుకున్నావు?"

అతనేమీ మాట్లాడలేదు. మౌనంగా కూర్చున్నాడు.

“సరే , నిన్ను ఇబ్బంది పెట్టే విషయాలైతే వద్దులే. సారీ.”

తప్పకుండా పార్టీకి రావాలని మాట తీసుకుంది.

ఆమె రూం నుండి బయటికి రాగానే, అతనికి పాత విషయాలన్నీ గుర్తొచ్చాయి.

“ఒరే , ఇవాళ సాయంత్రం త్వరగా ఇంటికి రా.”

“ఏమ్మా?”

“హాస్పిటల్ కు వెళ్దాం.”

“ఏమైంది? నీకు వంట్లో బాలేదా?”

“నేను బాగానే ఉన్నాను. మీ సంగతే ! పెళ్ళయి మూడేళ్ళవుతోందా? ఇంతవరకూ ఒక కబురూ కాకరకాయలేదు. ఇంత లేటవడం మన వేపు ఎవరికీ లేదు.”

“అమ్మా , తను వింటే బాధపడుతుంది.” లోపలున్న భార్యకు వినిపిస్తుందేమోనని నెమ్మదిగా చెప్పాడు తల్లితో.

“నా బాధ అర్థం కాదేమిరా నీకు, ప్రతివాళ్ళూ అడిగేవాళ్ళే. కోడలికే విశేషమూ లేదా అని”

“కానీ ఇవాళ కుదరదేమో, ఆఫీసులో చాలా పనిఉంది.”

“అదేం కుదరదు. త్వరగా రావల్సిందే. ఏనాడు లేదు గనక పని. పెందరాళే వస్తే మీరిద్దరూ హాస్పిటల్ కు వెళ్దురుగానీ.”

"ఇదివరకు హాస్పిటల్ లో చూపెట్టుకున్నాంగా. అంతా బాగానే ఉందన్నారు."

"అందుకే ఈసారి వేరే డాక్టర్ దగ్గరకు వెళ్దురుగానీ. ఎవరో కాదు, మన భానుమతిగారి కోడలే. ఊళ్ళో చాలా పేరుంది."

లోపల పనిచేసుకుంటున్న కాత్యాయినికి ఆ మాటలన్నీ వినిపిస్తూనే ఉన్నాయి.

ఎదురుగా తన కింది ఉద్యోగి నిలబడి ఉన్నాడు.

"నిన్నేమయ్యావు?"

"పెళ్ళి చూపులకెళ్లాను సార్."

"ముందే చెప్పి, లీవ్ పెట్టి వెళ్ళొచ్చుకదా."

"చెప్పి వెళ్తుంటే సంబంధాలు కుదరడం లేదు సార్."

"ఏం పిచ్చి నమ్మకాలయ్యా? నువ్వేం చిన్న పిల్లవాడివా, చెప్పకుండా స్కూల్ మానెయ్యడానికి ? బాధ్యతలేదూ?" అప్పటికే నిలబడినతనికి కళ్లలో నీళ్ళు తిరుగుతున్నాయి.

"లీవ్ తీసుకోగానే, ఆఫీసులో అంతా ఏడిపిస్తారు సార్. నాకు పెళ్ళి కుదరదంట." కళ్లలో నీళ్ళు చొక్కా పైకెత్తి తుడుచుకున్నాడు.

ఎన్నాళ్ళనుండో పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నాడు. ఒక్కటీ కుదరడం లేదు.

అతన్ని మందలించినందుకు జాలివేసింది.

సారథి లేచాడు. " కాంటీన్ కెళ్దాం రా." అంటూ అతన్ని తీసుకెళ్ళాడు.

ఆఫీసు బిల్డింగ్ లో అన్నిటి కన్నా పై అంతస్తులో కాంటీన్ ఉంది. ఉడెన్ ఫ్లోర్ మీద అక్కడక్కడా ఇండోర్ ప్లాంట్స్ పెట్టారు. గ్లాస్ కేబిన్స్ లో తినే పదార్థాలు పద్ధతిగా సర్ది ఉన్నాయి. ఆఫీసు ఉద్యోగులకు మాత్రమే ఏర్పాటు చేసిన కాంటీన్ కానీ, చూస్తే బయటి రెస్టారెంట్స్ వాతావరణం కనిపిస్తుంది. బయటి మనుషులెవరూ రారు కాబట్టి రద్దీ ఉండదు. ఓ పక్కన టేబిల్ దగ్గర కూర్చున్నారు. వాళ్లు కూర్చున్న చోటి నుండి దూరంగా నీలం సముద్రం అలజడిగా ఉన్నట్టు కనిపిస్తోంది.

ఫుడ్ తెచ్చుకుంటానంటూ అతను వెళ్ళాడు. ప్లేట్ నిండా, బిరియానీ, చికెన్ కూర , చపాతీలు ఏవేవో సర్దుకుని తెచ్చుకున్నాడు.

"సార్ మీక్కూడా తెస్తాను. ఏం తెమ్మంటారు."

"వద్దులే , నువ్వు కూర్చో."

"ఇప్పుడే వస్తాను సార్." అంటూ వేరే ప్లేట్ లో పండ్ల ముక్కలు, కొన్ని స్వీట్స్ తెచ్చాడు.

అతను కూర్చున్న తర్వాత అడిగాడు.

"ఇంతకూ వెళ్ళిన పనేమైంది? పెళ్ళి కుదిరినట్టేనా?"

"పిల్ల వాళ్ళు ఆలోచించుకుని కబురు చేస్తామన్నారు సార్."

అతనికి పెళ్ళి లేటు.

తనకి పిల్లలు కలగడం లేటు.

ఆఫీసులో వేరే ఉద్యోగులు జట్టులు, జట్టులుగా లోపలికి అడుగుపెట్టారు. వీళ్ళిద్దరి వైపు చూసి వేరే వైపు వెళ్ళారు. సారథి కాఫీ తెచ్చుకోవడానికని లేచాడు.

సారథి , ఒక మగ్ తో కాఫీ నింపుకుని తమ టేబుల్ వైపు వస్తుంటే తోటి ఉద్యోగుల మాటలు వినపడుతున్నాయి.

“ఏంట్రా శీనూ , కాంటీన్ లో ఒకటే బూడిద.”

“ఎక్కడ సార్. నాకేం కనిపించడం లేదు.”

“కనిపిస్తే కాంటీన్ లో ఎందుకు చేస్తావోయ్. మాలా కాబిన్ లోనే కూర్చునేవాడివి.”

“ఇందాకే అంతా శుభ్రంగా తుడిశానే.”

“నీ తప్పు కాదులే. రాసుకున్న కొద్దీ రాలుతుంది.” అతనన్న మాటలకు అంతా నవ్వారు.

సారథి అర్థమయీ కానట్లు ఉంది. వీళ్ళు తమ గురించే మాట్లాడుతున్నారా అనుకున్నాడు సారథి.

మనుషుల ప్రవర్తన పట్ల త్వరగా అతనికి అనుమానం రాదు.

తనలో ఆత్మన్యూనతాభావం పెరుగుతోందా? తోటి ఉద్యోగులేది మాట్లాడుకున్నా తననుద్దేశించే అని అనుకుంటున్నాడా?

ఉదయం జరిగిన విషయం గుర్తొచ్చింది.

ఆఫీసులో టేబిల్ మీద ఫైల్స్ సర్దుతుంటే, ఒక ఫైల్ కింద పడి పక్కనే ఉన్న బీరువా కింద ఇరుక్కుంది. అది తప్పించబోతుంటే మరింత లోపలికి వెళ్ళి ఇరుక్కుని పోయింది.

బీరువా జరిపితే సరిపోతుంది అని ఎత్త బోయాడు.

అది కదలడం లేదు.

ఇంతలో కిషోర్ లోపలికి వచ్చాడు.

“మీకెందుకు సార్ ఈ పనులు. మీరసలే డెలికేట్.”అంటూ బీరువా జరిపి, ఫైల్ తీసి ఇచ్చాడు.

కిషోర్ కు థాంక్స్ చెప్పి, తన సీట్లో కూర్చోబోతుంటే,

అకౌంటంట్ లోపలికి వచ్చాడు. ‘ఏమైందంటూ.’

సార్, బీరువా అంటూ చెప్పాడు కిషోర్.

"ఇలాంటి మోటు పనులకు మనమున్నాముగా,సార్ చెయ్యాల్సిన అవసరం ఏమిటి అంటున్నా”

అతను కూడా నొచ్చుకుంటున్నట్టు, “మమ్మల్ని పిలవండి సార్ . మీకేం కావాలన్నా మేము చేసిపెడతాం. మగవాళ్ళం, సాయం చేసుకోకపోతే ఎలా.”

❦❦❦

ఇంటికెళ్ళి పడుకున్నాడు.

“స్నానం చెయ్యకుండా పడుకున్నావేం రా?”

“తలనొప్పిగా ఉంది అమ్మా.”

“అదే పోతుందిలే. కాఫీ తాగి లే. రెడీ అయి హాస్పిటల్ కు వెళ్ళు.”

“ఏమిటమ్మా ఈ తొందర?” తల్లి ధోరణి కూడా విసుగ్గా ఉంది.

“అవున్రా తొందరే, గుడికెళ్లినా, పెళ్ళికెళ్ళినా అందరూ మీ కోడలికి పిల్లల్లేరా అని అడుగుతుంటే, వాళ్ళకి చెప్పలేక చస్తున్నా.”

కోడలికి పిల్లలు. కొడుక్కి పిల్లలు అని తల్లి అనదని గమనించాడు.

"అమ్మా, ప్రతిసారీ ఇలా అంటుంటే , పాపం తను నొచ్చుకుంటుందమ్మా."

విసురుగా బయటికి వచ్చింది కాత్యాయని.

"నేనేం నొచ్చుకోవడం లేదు. నా టెస్టులన్నీ బాగానే ఉన్నాయి.ఆవిడ ఏ హాస్పిటల్ కు వెళ్ళమన్నా నేను రెడీ ."

ఆమె కోపం చూసి సారథి , అత్తగారు ఇద్దర్లో ఎవరూ మాట్లాడలేదు.

"నేను రెడీ అయి చాలా సేపయింది." సారథి వైపు చూసి అంది.

సారథి లేచాడు.

కౌంటర్ లో నర్స్, వాళ్ళు చేయించాల్సిన టెస్టులన్నీ ఒక పేపర్ మీద టిక్ కొట్టి ఇచ్చింది.

"పోయిన సారి వేరే హాస్పిటల్ లో ఈ టెస్టులన్నీ చేశారండీ. ఎక్కువ టైం కూడా కాలేదు. ఆర్నెల్ల క్రితమే." పాత ఫైల్స్ తీసి చూపించాడు. సీడీ ఒకటి తీసి ఇచ్చాడు.

"ఈ ఆర్నెల్లలో మార్పులుంటాయి కదా. మళ్ళీ చేయించండి."

అన్ని టెస్టులూ అయ్యాయి.

"మీ టెస్ట్ కూడా అంటూ" కాంపౌండర్ లాంటి వ్యక్తి వచ్చి, అతనికో బాటిల్ ఇచ్చాడు.

హాస్పిటల్ వాసన పడక ఏమో, అతనికి కడుపులో తిప్పేస్తోంది.

అన్ని టెస్టులూ వచ్చాయి. ఎక్కడా లోపం లేదు.

'పాత హాస్పిటల్ కు ఎవరు చెప్తే వెళ్ళారు, ఎంతకాలం ట్రీట్ మెంట్ అయిందీ, ఈ హాస్పిటల్ కు ఎందుకు వచ్చారూ' వంటి వివరాలన్నీ కనుక్కుంది నర్స్.

"మీరెళ్ళిన హాస్పిటల్ సంగతి మాకు తెలుసు. అక్కడేమేం చేస్తారో కూడా తెలుసు. నయం ఇక్కడికి వచ్చారు." అంది.

డాక్టర్ తో ఫైనల్ మీటింగ్.

ఆమె ఎంతో బిజీ డాక్టర్ కాబట్టి అయిదు నిముషాలకు మించి టైముండదనీ, అనవసరమైన వాగుడుతో ఆ అయిదు నిముషాలు వృధా చెయ్యొద్దని కౌంటర్ లో నర్స్ నచ్చ చెప్పింది.

"విషయాలన్నీ నేనే చెప్తాను. మీరెక్కువ మాట్లాడకండి." అంటూ ఫైల్ తో సహా వీళ్ళిద్దర్నీ తీసుకుని లోపలికి వెళ్ళింది.

అయిదు నిముషాల భాగ్యానికి మళ్ళీ కూర్చోవడమెందుకని నిలబడే ఉన్నారు.

కాత్యాయని డాక్టర్ వంక చూసింది. ఆవిడ చాలా అందంగా ఉంది. ముదురు గులాబి రంగు పట్టు చీర , ఎంబ్రాయిడరీ చేసి, చెంకీలు కుట్టిన అందమైన బ్లౌజ్.

చుట్టూ చూసింది. టేబిల్ మీద ఒక రొమాంటిక్ జంట బొమ్మ డాన్స్ వేస్తున్నట్టు తిరుగుతోంది. సంపెంగ వాసన ఎయిర్ ఫ్రెషనర్.

ఎక్కడ , ఎలా ప్రవర్తించాలో , చాలా సార్లు పరిసరాలే ట్యూషన్ చెప్పేస్తాయి, .

వీళ్ళను కూర్చోమని చెప్పింది డాక్టర్. మెత్తని కంఠం.

"పర్లేదు మేడం" అని నిలబడే ఉన్నారు.

నర్స్ కళ్ళతో గదిమింది కూర్చోమనట్టు.

“చూడండి , మీ రిపోర్ట్స్ చూశాను. పర్లేదు. టెస్టులన్నీ బాగానే ఉన్నా , ఒక్కోసారి భార్యాభర్తలకు సెట్ కాదు. ఐ వి ఎఫ్ చేయించుకోండి. బెటర్.”

“వచ్చే నెల అపాయింట్మెంట్ ఇవ్వు” నర్స్ తో చెప్పింది ఆమె.

“ఎంత అవుతు ...”

“ఆ డిటైల్స్ అన్నీ బయట చెప్తాను.” అతని ప్రశ్న పూర్తికాకుండానే నర్స్ చెప్పింది.

“ఇంకో విషయం ఏమిటంటే, సక్సెస్ కావడానికి వేరే వాళ్ళ సాంపుల్ వాడితే బెటర్ అని అనిపిస్తోంది. మీరు కన్సెంట్ ఇస్తే చేస్తాము.”

“కౌంట్ బాగానే ఉందికదా మేడం.”

“ అన్నీ బాగానే ఉన్నట్టుంటాయి. కానీ మూడేళ్ళవుతున్నా ప్రెగ్నన్సీ రాలేదంటే ఏదో తేడా ఉండి ఉంటుంది. అమ్మాయికన్నీ బాగానే ఉన్నాయి. వేరే సాంపుల్ వాడితే రిజల్ట్స్ బావుంటాయి.” మరింత మెత్తగా చెప్పింది డాక్టర్.

సారథి కి ఏం చెప్పాలో అర్థం కాలేదు.

“అదీ... అది, ఆలోచించుకోవాలి.” అన్నాడు బలహీనమైన గొంతుతో.

భార్య వంక చూశాడు. తన టెస్టులన్నీ బాగున్నాయి కనక , నీదే లోపం అన్నట్టు చూస్తోంది.

"అంతగా అయితే మీ శాంపుల్ కూడా మిక్స్ చేస్తాము"

తలనొప్పి ఎక్కువైంది. కడుపులో మరింత తిప్పుతోంది.

సారథి జవాబు చెప్పలేదు.

“చాలామంది మగవాళ్ళు తమంతట తామే అడుగుతున్నారు డోనార్ సాంపుల్ వాడమని. చదువుకున్న వాళ్ళు మీరు కూడా ఇలా ఆలోచిస్తే ఎలా? ఓపెన్ మైండ్ ఉండాలి కదా.”

భార్య వైపు చూసే ధైర్యం లేకపోయింది. ఆమె కళ్ళలో ఏ నిర్ణయముంటుందో?

అది తట్టుకోగలిగే శక్తి తనకుంటుందో లేదో?

అతనింకా ఆలోచిస్తూ ఉండడంతో డాక్టర్ " చూడండి , ఇవాళ ఆలోచించుకుని రేపుదయం ఏ విషయమూ చెప్తే, నేను ట్రీట్ మెంట్ స్టార్ట్ చేస్తాను.ఒక వేళ మీరు రేపు చెప్పకపోతే, ఆ స్లాట్ వేరే వాళ్లకిస్తాము. మీరు ఇంకొక నెల ఎదురు చూడాల్సిందే.”

ఇప్పుడే చెప్పేసి ఆ అవకాశం తీసుకోవాలన్న తొందర కనిపిస్తోంది కాత్యాయని కళ్ళలో.

“వచ్చేనెల చేయించుకుంటాం మేడం.” సారథి జవాబు చెప్పడం లేటవుతోందని ఆమె చెప్పేసింది.

“గుడ్. అరేంజ్ చెయ్యి” నర్స్ వంక చూసింది డాక్టర్.

“ఇక రండి.” అంటూ వాళ్ళిద్దర్నీ బయటికి తీసుకువెళ్ళింది.

డోర్ బయట ఎదురు చూస్తున్న జంట దాదాపు వీళ్ళను రాసుకుంటూ లోపలికి అడుగు పెట్టారు.

ఒక సారి ఐ వి ఎఫ్ కు ఎంత అవుతుందో చెప్పింది నర్స్.

అదృష్టం ఎంతో గొప్పగా ఉంటే తప్ప మొదటి సారి సక్సెస్ కాదనీ, కనీసం మూడు సార్లైనా చేయించుకుంటే బెటర్ అని చెప్పింది. .

తన సేవింగ్స్ ఎంతో గుర్తు తెచ్చుకున్నాడు.

వేరే వారి సాంపుల్ వాడడానికి సంతకం పెట్టమని అనుమతి పత్రం ఇచ్చింది.

"ఒక్క రోజు టైమివ్వగలరా?" అడిగాడు సారథి.

"ఇంత ఆలోచిస్తున్నారేంటి సార్. రక్తం కావాలంటే, వేరే వాళ్ళ రక్తం ఎక్కించుకోవడంలా? ఇదీ అంతే" నర్స్ అంది.

మంచినీళ్ళు తాగినంత సులభం.

భార్యకేమీ అభ్యంతరం లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది.

"త్వరగా చెప్పండి ఏ విషయమూ."

కాత్యాయనికి అతని చేసే ఆలస్యం చూస్తే విసుగొస్తోంది.

"మేము చేయించుకుంటామండీ." నర్స్ తో చెప్పింది ఆమె.

"అయితే రేపొచ్చి పేమెంట్ ఇచ్చి, పేరు రాయించుకోండి." నర్స్ లోపలికెళ్ళిపోయింది.

ఇంటికొచ్చే దారిలో ఎవరి ఆలోచనల్లో వారున్నారు. మాట్లాడుకోలేకపోయారు.

ఇంటికి రాగానే కాత్యాయని బెడ్ రూం లోపలికి వెళ్ళి పడుకుంది.

"బుజ్జీ, తినకుండా పడుకున్నావే"

"ఆకల్లేదు. నిద్రవస్తోంది." అలిగిందని తెలుస్తూనే ఉంది.

ప్లేట్ లో భోజనం పెట్టి తీసుకెళ్ళి భార్యను లేపాడు.

"టెస్టుల్లో లోపమూ లేదన్నారు కదా బుజ్జీ. ఎందుకంత తొందర."

"మీకేం హాయిగా ఆఫీసుకెళ్ళి ఎప్పటికో వస్తారు. కోడలికి పిల్లల్లేరని అందరూ అంటున్నారని మీ అమ్మ అంటుంటే నాకెలా ఉంటుంది?"

"నెమ్మది. అమ్మ వింటుంది."

"విననీయండి. ఆవిడేమైనా నెమ్మదిగా సాధిస్తోందా నేను నెమ్మదిగా మాట్లాడడానికి?"

"సరే, నీకు నచ్చినట్టే చేద్దాం. చెప్పు ఏం కావాలో."

"వచ్చేనెల ఐ వి ఎఫ్ చేయించుకుంటాను."

"ఒక వేళ సక్సెస్ కాకపోతే?"

"అనుమానంతో చేస్తారా ఎవరైనా. అవుతుందనుకుని చెయ్యాలిగానీ"

స్త్రీ కన్నా , మగవాడికే అవసరం, గృహ శాంతి.

అందుకే ఎక్కువ సార్లు అతనే రాజీ పడతాడు.

రాత్రి ఎప్పటికోగానీ నిద్రపట్టలేదు. నిద్రలో కలలు.

రేప్పొద్దున్నే పరీక్ష.

కానీ ఏ సబ్జెక్ట్ లో పరీక్షో తెలియదు. కనుక్కుందామని , ఆ సాయంత్రం స్నేహితుడింటికి వెళ్తే అతనింట్లో లేడు. అతని కోసం ఎదురుచూస్తూ వాళ్ళింటి ముందు చెట్టుకింద కూర్చున్నాడు.

మెలకువ వచ్చింది. 'అబ్బ , ఏమిటీ కలా?' అనుకున్నాడు.

గుండె వేగంగా కొట్టుకుంటోంది.

కాత్యాయనిని చూశాడు. అటు తిరిగి పడుకుని ఉంది.

ఆమె నిద్ర చెడకుండా, శబ్దం చెయ్యకుండా లేచి బయటికి వచ్చాడు.

ఇంటి బయట పేపర్, పాల పేకెట్లు పడి ఉన్నాయి. అవి తీసి లోపల పెట్టి, ప్రతిరోజూ చేసే చిన్న చిన్న పనులు నిశ్శబ్దంగా చేసి బయటికి వచ్చాడు.

తెల్లవారబోతోంది. బాదం చెట్టుకింద నిలబడి పేపర్ చదువుతుంటే, ఇంటి ఓనర్ రెండు కుర్చీలు తెచ్చి చెట్టుకింద వేశాడు.

"కూర్చోవోయ్" అని మళ్ళీ ఇంట్లోకి వెళ్ళాడు.

అయిదు నిముషాల తర్వాత, రెండు కప్పుల్లో టీ తీసుకుని బయటికి వచ్చాడు.

"ఎందుకు సార్ ఇవన్నీ?"

"ఏముంది ఇందులో, మా ఆవిడక్కూడా నేనే ఇస్తా, అసలు మా ఇంట్లో వంట నేనే చేస్తానోయ్." ఆయన పక్కనే వచ్చి కూర్చున్నాడు.

సారథి పేపర్ మడత పెట్టి ఆయన వంక చూస్తున్నాడు.

"విషయమేంటంటే, మా ఆవిడ ఉట్టి పిచ్చి మొహంది. అది వంట చేస్తే ఘోరం. దాని వంట అదే తినలేదు, పాపం."

సారథి చిన్నగా నవ్వాడు.

"ఇప్పుడు నువ్వుంటున్న ఇల్లు చాలా లక్కీ హౌస్ తెలుసా, మునుపు అదే పోర్షన్ లో సుదర్శనం అని బాంక్ మేనేజర్ అద్దెకుండే వాడు. పెళ్ళయి ఎనిమిదేళ్ళు. పాపం నీకు లాగే పిల్లల్లేరు. నేనంటే వల్లమాలిన అభిమానం. నా మాటంటే విపరీతమైన గురి. అంకుల్ అంకుల్ అంటూ ప్రతిదీ నన్నే అడిగేవాడు."

సారథి మౌనంగా వింటున్నాడు.

"ఓ రోజు అతనికి ఒక సలహా చెప్పాను. అంతే, నెల తిరిగే సరికి వాళ్లావిడ గర్భవతి అయ్యింది."

టీ కప్పు పక్కన పెట్టాడు.

"చల్లారిపోతుంది, తాగు" హెచ్చరించాడాయన.

"రోజూ పడుకోబోయే ముందు దానిమ్మలు తిను. ఎందుకు చెప్తున్నానో విను. ఖర్జూరాలు ఆవునెయ్యితో కలిపి పుచ్చుకో." చిన్న గొంతుతో కొన్ని ఆయుర్వేద సలహాలు వినిపించాడు

"ఇంతకూ మీరిద్దరూ నైరుతిలోనే పడుకుంటున్నారు కదా" అని విచారించాడు.

ఉదయాన్నే, సెన్సారుకు నోచుకోని సినిమా చూసినట్టుంది సారథికి. ఇంకా ఆయన ఏవేవో చెప్తుంటే,

"చిన్న పనుందండీ" అని లేచి లోపలికి వెళ్ళాడు సారథి.

కిటికీ లోంచి బయటికి చూస్తూ నిలబడ్డాడు. బాదం చెట్టు మీద చిలకలు , పిందెల్ని కొట్టి పడేస్తున్నాయి.

కాత్యాయని స్నానం చేసి తడి జుట్టు విదిలిస్తూ హాల్లోకి వచ్చింది. తడి జుట్టు అందంగా కనపడి, ఆమె దగ్గరకెళ్ళి సవరించబోయాడు.

అదే టైం కు 'ఇదిగో సారథీ' అని పిలుస్తూ లోపలికి వచ్చాడు ఓనర్.

భార్యాభర్తలు దూరంగా జరిగి నిలబడ్డారు.

"మన ప్రహరీ బయట అన్నీ చెట్లేగా! వెతికితే దొరికాయి."

అంటూ గుప్పెడు ఆకులు తెచ్చి సారథి చేతిలో పెట్టాడు.

"ఏమిటండీ ఇవి? ఎందుకు?"

"ఆముదం ఆకులు. ఇవి ఎండబెట్టి, పొడి చేసి , తేనెతో కలిపి,"

చెవులు పనిచేయడం మానేశాయి. ఆయన చెప్పే వేమీ వినబడడం లేదు.

శ్రేయోభిలాషులు. మన సమస్యల పట్ల, మన కన్నా వాళ్ళకే అవగాహన ఉంటుంది. మన గురించి ఎక్కువ సమయం వాళ్ళే ఆలోచిస్తుంటారు గనుక.

రెండు సార్లు ఐ వి ఎఫ్ అయింది. రెండు సార్లూ సక్సెస్ కాలేదు. దాచుకున్న సేవింగ్స్ అన్నీ అయిపోయాయి.

ఆరు నెలలు గడిచాయి.

నెల జీతం వస్తోంది. మళ్ళీ పొదుపు చెయ్యడం మొదలుపెట్టాడు.

పిల్లలకోసం డబ్బు ఖర్చు లేని ప్రయత్నాలు మొదలెట్టింది సారథి తల్లి. పక్క ఊరి కొండమీద గుడి లో, ఒక రాత్రి నేల మీద నిద్రపోతే, పిల్లలు పుడతారని విని, ఒక శనివారం అక్కడికి తీసుకువెళ్ళింది. కొండ పెద్ద ఎత్తుగా ఏమీలేదు. వందో, నూట యాభయ్యో మెట్లుంటాయి. సాయంత్రం పూట చల్లగా ఉంటుందని నడక మొదలెట్టారు. మధ్యలోనే కాత్యాయని కళ్ళు తిరిగి ఇక నడవలేనంది. పైవరకూ ఎక్కలేనంది. కిందకు తీసుకుని రాగానే నీరసంగా ఉందని సొమ్మసిల్లింది.

దగ్గర్లో ఉన్న హాస్పిటల్ కు తీసుకెళ్తే, ఆమె గర్భవతి అని చెప్పారు.

ఒక్క క్షణం సంతోషంగా అనిపించింది సారథికి.

సంవత్సరమంతా కష్టపడి చదివినా, పాసయ్యాక, ఆనందంగా అనిపించేది ఒక్క క్షణమే!

ఇంటి ఓనర్ సంతోషానికి అంతులేదు. తమ ఇంటి మహిమ, తన వాస్తు ప్రయోగాలు, సలహాల వల్లే అలా జరిగిందని ఆయన పూర్తి నమ్మకంతో ఉన్నాడు.

లేటుగా వచ్చిన విలువైన గర్భం గనక, ఆమెకు ఆపరేషన్ ద్వారా కాన్పు అయింది. మూడునెలల తర్వాత కాత్యాయని, పాపను తీసుకుని అత్తగారింటికి వచ్చింది.

ఉయ్యాల ఫంక్షన్ ఘనంగా చెయ్యాలంది. మరీ అంత ఆర్భాటం కాకుండా తక్కువలో చేసుకొమ్మని సూచించింది అత్తగారు. ఇద్దరు ఆడవాళ్ళింట్లో ఉండగా , నిర్ణయాలు తీసుకోవాల్సిన ఖర్మ మగాడికుండదు గనక మౌనంగా ఉన్నాడు సారథి.

వీళ్ళకు పిల్లలు కలగడం లేదని, మునుపు ఆందోళన పడ్డ బంధువుల్నీ , స్నేహితుల్నీ, పిలిచారు.

శనివారం సాయంత్రమైతే, ఆఫీసు నుండి వెళ్తూ వెళ్తూ, పిల్ల మీద అక్షింతలేసి ఇళ్ళకెళ్ళిపోవడం సౌకర్యంగా ఉంటుందన్నారు సన్నిహితులు. అలాగే ఏర్పాటు చేశాడు.

ఆడవాళ్ళు, ఆఫీసులో పార్టీకి తగిన డ్రెస్సులు మార్చుకున్నారు. వారి అందం మీద, అప్పియరన్స్ మీద తగినంత ఆత్మవిశ్వాసం ఉంది గనక, మగవాళ్ళు ఆఫీసు బట్టలతో అలాగే విచ్చేశారు.

పార్టీ విషయంలో, సారథి సామర్థ్యం మీద పెద్దగా నమ్మకం లేని ఓనర్ గారే, ఏర్పాట్లన్ని దగ్గరుండి చూసుకున్నాడు.

తెలిసిన కాటరింగ్ సర్వీస్ వాళ్ళ ద్వారా ఫుడ్ తెప్పించాడు. ఇంటిముందున్న చెట్లకు బల్బుల తోరణాలు కట్టించాడు. బాదం చెట్టుకి దీపావళి పండగొచ్చింది.

ఇల్లంతా బూరలు, బెలూన్లు  కట్టడం, వాళ్ళ వంటింటింటి నుండి ప్లేట్లు, గరిటెలు సరఫరా చెయ్యడం , ఒకటేమిటి. 'తలలో నాలుక' అనే మాటకు ఉదాహరణలా నిలిచాడు ఇంటి ఓనర్.

బంధువులందరూ వచ్చారు. పాపకు గులాబి రంగు సిల్క్ గౌన్ వేసింది కాత్యాయని. అక్షింతలేశారు. దీవించారు. పార్టీకొచ్చిన అందరూ, పోలికలు పసిగట్టడం అనే పజిల్ గేం ఆడారు. పాప ముక్కెవరిది, మూతెవరిది అన్న చర్చలో గెస్టులంతా, రెండు జట్టులుగా విడిపోయారు.

ఆ ముక్కూ , నుదురూ ,ఎక్కువగా తల్లి పోలికలే కనిపిస్తున్నాయని అన్నారు.

తండ్రిపోలిక వస్తే అదృష్టవంతురాలయేదని అన్నారు.

చర్చ ఎటో దారితీస్తోందని గమనించిన ఒక గెస్ట్, వారినందరినీ కంట్రోల్ చేసే  ఉద్దేశంతో

“పార్టీ అంటే సరదాగా ఉండాలి. మనం ఆనందంగా గడపాలి. గెస్ట్ కు ఆనందం మిగల్చాలి. అంతేగానీ, ఈ టెస్ట్ ట్యూబ్ రోజుల్లో కూడా, పోలిక లేమిటండీ మీ చాదస్తం కాకపోతే! కాస్త ఓపెన్ మైండ్ ఉండాలండీ.” అన్నాడు

సారథి అతని వైపు  చూశాడు.

వైద్య రంగం అభివృద్ధి చెందిన, ఈ రోజుల్లో పాత భావాలను పట్టుకుని వేళాడడం అంత మంచి పద్ధతి కాదని ఆఫీస్ కొలీగ్ అందరికీ నచ్చజెప్పాడు. అక్కడెక్కడో అరవై ఏళ్ళ ఆవిడకు ఐ వి ఎఫ్ చేశారని, ఇంకా ఎక్కడో,  ఎనభై ఏళ్లావిడ సిజేరియన్ జరిగాక పండండి బిడ్డని ప్రసవించిందనీ  చెప్పుకున్నారు.

భోజనాలయ్యాక అందరూ వెళ్ళిపోయారు.

మిగిలి పోయిన ఆహారం ఫ్రిజ్ లో కుక్కడం లో కాత్యాయని బిజీగా ఉంది. అత్తగారు ఆమెకు సహాయం చేస్తోంది.

పెద్దగా చప్పుడయింది. బెలూన్ పగిలినట్టుంది. ఆ చప్పుడుకు ఉయ్యాల్లో పాప పెద్దగా ఏడుపందుకుంది. పాపని చూడమని కేకేసింది కాత్యాయని. అతనికి పసి బిడ్డలను పట్టుకోవడం ఇంకా కొత్తగానే ఉంది.  గులాబి రంగు సిల్క్ గౌన్. లేయర్స్ లేయర్స్ గా ఉండి చిర చిరలాడుతున్నట్టుంది. చిరాకంతా మొహంలోనే చూపిస్తూ ఏడుస్తోంది.

పాపని ఎత్తుకున్నా ఆగడం లేదు. లోపలికి వెళ్ళి పాప బట్టలున్న అల్మైరా తెరిచాడు. మెత్తటి ఆకాశం రంగు డ్రెస్ తీసుకున్నాడు. పాపని మంచం మీద పడుకోబెట్టి, డ్రెస్ మార్చాడు. లోపల మరీ వేడిగా బయటికి తీసుకు వచ్చాడు.

ఓనర్ కూడా బయటికి వచ్చాడు.  ఎప్పుడూ కూర్చునే బాదం చెట్టుకింద  కూర్చున్నారు.

పార్టీ బాగా జరిగిందని, వంటకాలు బాగా కుదిరాయని, అందరూ ప్రశంసించారని అన్నాడు.

థాంక్స్ చెప్పాలి, కానీ చెప్పలేకపోయాడు సారథి.

పాప ఇంకా వెక్కిళ్ళు పడుతూనే ఉంది.

"నేనో మాట చెప్తే ఏమనుకోవుగా"

"చెప్పండి సార్"

“పిల్లని జాగ్రత్తగా పెంచుకో సారథి. విషయం ఎప్పటికీ తెలియనివ్వకు.”

“ఏ విషయం?”

“బిడ్డలు దైవానికి ప్రతి రూపాలు సారథి. నీ భార్యని దేవతలా చూసుకో. పాపకు లోటు రానీయకు. తేడా చూపకు.”

"తేడా ఏమిటి?”

"బిడ్డ ఎవరిదైతే ఏమిటి సారధి. ప్రపంచానికి నిన్ను తండ్రిగా నిలబెట్టింది. నీ పరువు కాపాడిందని గుర్తుంచుకో."

"అయ్యో , మీకెలా చెప్తే అర్థమవుతుందండీ?" మొదటి సారి సహనం కోల్పోయాడు.

"తండ్రిలాంటి వాడిని. నాకు నువ్వు చెప్పాలా? నేనర్థం చేసుకోలేనా."

తండ్రి గుండె వెక్కిళ్ళు విన్నదేమో, పాప ఏడుపాపేసింది. తండ్రి భుజమ్మీద శాంతిగా తలపెట్టుకుంది.

దొంగ వాదించినంత బలంగా, స్వంతదారు వాదించుకోలేదు.

సత్యానికి వాదన అవసరం లేదని నమ్ముతాడు గనక .

ఆయనతో ఏమీ చెప్పదలుచుకోలేదు.

" సరేలే , ఇవన్నీ మర్చిపో."

సారథి మూడ్ బాలేదని అనుకుని, టాపిక్ మార్చే ఉద్దేశంతో "బాగా చదివించి వృద్ధిలోకి తీసుకురా. ఇంతకూ పాపని ఏం చేద్దామనుకుంటున్నావు?"

'పక్క వాళ్ళ జీవితాల్లోకి తొంగి చూడాలనుకునే ఆసక్తి లేకుండా పెంచగలిగితే చాలు.'

ప్రశ్నలకు సమాధాలుంటాయి.

పైకి చెప్పలేని సమాధానాలు!

లేచి నిలబడ్డాడు.

"గుడ్ నైట్ సార్"

Post your comments